బుధవారం 28 ఆగస్టు 2024

ఈ-పేపర్ తెలుగు డైలీ

# ఇయ్యాలి NEWS Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/



WANTED REPORTERS

విలేకరులు కావలెను

RNI NO T/TG/2024/1093

Cell : 7013794396

అతితక్కువ కాలంలో 65వేలకు పైగా రీడర్ల మనసు దోచుకున్న ఇయ్యాల్టి న్యూస్ లోకల్ 2 గ్లోబల్ ... ఈ పేపర్ డైలీ పత్రికలో పని చేయుటకు తెలంగాణ వ్యాప్తంగా విలేకరులు కావలెను. కనీస విద్యార్హత కలిగి జర్నలిజంపె ఆసక్తి, తెలుగులో టైప్ చేయగలవారై ఉండాలి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలతో పాటు అన్ని మండలాల వారిగా విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత.. ఆసక్తి ఉన్న వారు వెంటనే సంప్రదించండి.

OFFICE ADDRESS
RRR MEDIA, PATELNGAR, AMBARPET, HYD-500013
email id.ramannews9@gmail.com





రేవంత్ రెడ్డీ... ఒవైసీ బ్రదర్స్ కు భయపడకుండా దానిని కూల్చెయ్: సీఎంకు రాజాసింగ్ మద్దతు 2లో



ఛీ నువ్వు తల్లివేనా..? లవర్‌తో లేచిపోయేందుకు కూతుర్ని చంపేసింది 3లో



హిందూ మహాసముద్రంలో ఉద్రిక్తత.. ఎదురుపడిన భారత్- చైనా నౌకాదళాలు 3లో



పుతిన్‌తో మాట్లాడిన ప్రధాని మోదీ.. ఉక్రెయిన్ పర్యటనపై చర్చ 3లో

## కొత్త రేషన్,హెల్త్ కార్డులపై సీఎం రేవంత్ గుడ్ న్యూస్..

# వచ్చే నెల 17 నుంచే స్టార్ట్



-ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, ఆగస్టు 27:సెప్టెంబర్ 17 నుంచి 10 రోజుల పాటు రాష్ట్రమంతటా ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు జారీ చేసేందుకు ఈ సారి ప్రజాపాలన కార్యక్రమం చేపడతామని చెప్పారు. ఇకపై రేషన్ కార్డులు, హెల్త్ కార్డులకు లింక్ ఉండదని, వేర్వేరుగా కార్డులు జారీ చేస్తామని సీఎం చెప్పారు. ప్రజా పాలనలో ప్రతి కుటుంబం నుంచి అందుకు అవసరమైన వివరాలను సేకరిస్తామన్నారు. రాష్ట్రమంతటా అన్ని గ్రామాలు, వార్డుల్లో ప్రజా పాలన కార్యక్రమానికి నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహాతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చొంగ్తూ, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

హెల్త్ డిజిటల్ కార్డుల జారీకి ఎలాంటి పద్ధతి అనుసరించాలి... ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ను నమోదు చేసేందుకు ఏయే వైద్య పరీక్షలు చేయాలి.. గ్రామాల్లోనే హెల్త్ చెకప్ శిబిరాలు ఏర్పాటు చేయాలా... రాష్ట్రంలో ఉన్న లాబోరేటరీల సాయం తీసుకోవాలా...? వెంటనే పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. హెల్త్ డిజిటల్ కార్డుకు సంబంధించి ఫ్రాన్స్ ఉత్తమమైన విధానం అనుసరిస్తున్నారని ఇటీవల విదేశీ పర్యటనలో తనను కలిసిన ప్రతినిధులు చెప్పారని, అక్కడ అనుసరించే విధానాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ వైద్య సేవలకు, సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించేందుకు ఇకపై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే హెల్త్ కార్డు ప్రామాణికంగా ఉంటుందని సీఎం అన్నారు.

### ఆరోగ్యంతో చెలగాటమాడితే సస్పెండ్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డెంగ్యూ, చికున్ గున్యా, వైరల్ జ్వరాలతో వివిధ ఆసుపత్రుల్లో పెరుగుతున్న కేసులపై ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాధులు రాకముందే తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్తో పాటు రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో దోమల నిర్మూలనకు ఫాగింగ్, స్ప్రే ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ క్రమం తప్పకుండా జరిగేలా చూడాలని, ఎప్పటికప్పుడు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీలు చేయాలని సీఎం ఆదేశించారు. పని చేయని ఉద్యోగులను, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చేపట్టే చర్యల పట్ల ఉదాసీనంగా వ్యవహరించే వారిని సస్పెండ్ చేయాలని సీఎం హెచ్చరించారు.

## ఎట్టకేలకు జైలు నుంచి కవితక్క విడుదల

- రూ.10 లక్షల పూచికత్తుతో సుప్రీం బెయిల్
- ఇయ్యాల మధ్యాహ్నం హైదరాబాద్ కు కవిత





ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ , ఆగస్టు 27:ఢిల్లీ లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఈడీ, సీబీఐ రెండు కేసుల్లోనూ ఆమెకు బెయిల్ లభించింది. బెయిల్ కోసం రూ.10 లక్షల పూచీకత్తు సమర్పించాలని సూచించింది. సాక్షులను ప్రభావితం చేయకూడదని ఆదేశించింది. దీంతో దాదాపు 165 రోజుల తర్వాత కవిత జైలు నుంచి బయటకు రానున్నారు. మంగళవారం రాత్రి కవిత తీహార్ జైలు నుంచి విడుదల అయ్యారు. రాత్రికి ఆమె ఢిల్లీలోనే బస చేశారు. బుధవారం మధ్యాహ్నం 2:45 గంటలకు ఢిల్లీ నుండి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోనున్నారు. కవిత వెంట ఆమె భర్త అనిల్ కుమార్, కేటీఆర్, హరీష్ రావు రానున్నారు. ఇక ఈ ఉదయం బీఆర్ఎస్ నేతలు ఢిల్లీలో ప్రెస్ మీట్ పెట్టే అవకాశం ఉంది.కాగా.. కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. లిక్కర్ కేసులో దర్యాప్తు పూర్తయ్యిందని.. ఛార్జ్ షీట్ కూడా దాఖలైందని ఈ దశలో కవితను జ్యుడీషి యల్ కస్టడీలో ఉంచడం సరికాదని అభిప్రాయడింది. సెక్షన్ 45 ప్రకారం ఒక మహిళ బెయిల్ పొందేందుకు అర్హత ఉందని ధర్మాసనం తెలిపింది. గతంలో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టిపారేసింది. సెక్షన్ 45 అనేది దుర్బల మహిళలకు మాత్రమే వర్తిస్తుందన్నట్లు హైకోర్టు జడ్జి వ్యవహరించారని పేర్కొంది. సెక్షన్ 45పై కోర్టులు సున్నితంగా వ్యవహరించాలని చెప్పింది. ఒక మహిళ విద్యాధికురాలు అయినంత మాత్రాన ఆమెకు బెయిల్ నిరాకరించడం సరికాదని తెలిపింది. ఈ మేరకు సుప్రీం బెయిల్‌ను మంజూరు చేసింది.

## లాయర్ ముకుల్ రోహత్గీ ...గంటకు తీసుకునే ఫీజు ఎంతంటే...?



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, ఆగస్టు 27:ఎట్టకేలకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జైలు నుంచి రిలీజ్ అయింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ ఈడీ కేసులో ఆమెకు సుప్రీంకోర్టు షరుతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దాదాపుగా గంటన్నరట పాటు వాదానలు జరిగాయి. దర్యాప్తు సంస్థల తరఫున లాయర్ ఎస్వీ రాజు, కవిత తరఫున ముకుల్ రోహత్గీ తమ వాదనలు వినిపించారు. ఫైనల్ గా కవిత బెయిల్ కు అర్హురాలని ముకుల్ రోహత్గీ వాదనలతో ఏకీభవించిన సుప్రీంకోర్టు కవితకు బెయిల్ ఇచ్చింది. కాగా..దేశంలోనే అగ్రశ్రేణి న్యాయవాదులలో ఒకరిగా ముకుల్ రోహత్గీ కొనసాగుతున్నారు. ఈ క్రమంలో కవిత తరపు లాయర్ ముకుల్ రోహత్గీ గురించి పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఆయనకు క్లైంట్స్ ఇచ్చే ఫీజుపై కూడా ఆసక్తి నెలకొంది. తమ కేసులను వాదించుకునేందుకు ఈయన్ను నియమించుకోవాలంటే.. గంటల సమయం లెక్కన ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఈయన గంటకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఫీజు ఛార్జ్ చేస్తారని చెబుతుంటారు. న్యాయ నిపుణుడే కాక, వివిధ క్లిష్టమైన కేసులను కూడా ఒంటి చేత్తో గెలిచిన వ్యక్తిగా రోహత్గీకి పేరుంది.

### ఆర్నెల్లుగా జైల్లోనే కవిత

మార్చి 15న లిక్కర్ కేసులో కవిత ను ఈడీ అరెస్ట్ చేసింది. ఈక్రమంలో ఆమె పలుమార్లు బెయిల్ కోసం ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. ఈ సారి కవిత తరపు లాయర్ రోహత్గీ బలంగా తన వాదనలు వినిపించారు. ఢిల్లీ లిక్కర్ పాలసీలో రూ.100 కోట్లు చేతులు మారాయన్నది ఆరోపణ మాత్రమే. కేసులో 493 మంది సాక్షులను విచారించారు. కవిత ఎవరినీ బెదిరించలేదు. ఆమె దేశం విడిచి వెళ్లే అవకాశమే లేదు. కవిత కు బెయిల్ పొందే అర్హత ఉంది అంటూ తన వాదనలను బలంగా వినిపించారు.

ఆ బాలుడి చికిత్స తమదే బాధ్యత!.. సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు 2లో


## కవితకు బెయిల్..బీఆర్ఎస్ లో జోష్..ఇక రంగంలోకి కేసీఆర్!



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, ఆగస్టు 27: రాష్ట్రంలో గత ఎన్నికల ఫలితాల తర్వాత దెబ్బతిన్న బీఆర్ఎస్ పార్టీ కవిత అరెస్టుతో పూర్తిగా కుదేలైంది. కవిత అరెస్టుతో పార్టీ శ్రేణుల్లో అభద్రత భావం పెరిగి చాలామంది బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్, బిజెపిలలో చేరారు. మార్చి నెల నుంచి ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో అరెస్టు అయిన కవిత ఈడి, సిబిఐ కేసులలో చిక్కుకొని ఇంతకాలం తీహార్ జైల్లో నరకం అనుభవించారు. కడప సెంట్రల్ జైల్ పై శ్రద్ధ పెట్టిన చంద్రబాబు, వివేకా హత్య కేసు నిందితులకు షాక్ కవిత అరెస్ట్ తో కుదేలైన బీఆర్ఎస్ ఇక తాజాగా నేడు కవితకు బెయిల్ రావడంతో బిఆర్ఎస్ పార్టీకి జవసత్వాలు వచ్చినట్టయ్యింది. ఎమ్మెల్సీ కవిత అరెస్టు తర్వాత తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ దారుణంగా దెబ్బతింది. కవిత అరెస్టు తర్వాత జరిగిన లోక్సభ ఎన్నికలలో బీఆర్ఎస్ పరువు పోగొట్టుకుంది. ఢిల్లీ లిక్కర్ కుంభకోణం లో కవిత ఉండటమే తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ పార్టీకి పెద్ద మైనస్ గా మారింది.

### కవిత బయటకు వచ్చాకే కేసీఆర్ అసలు రాజకీయం


ఈ క్రమంలో కేసీఆర్ కూడా పెద్దగా ప్రజల్లోకి రావడానికి ఆసక్తి చూపించలేదు. అడపాదడపా బయటకు వచ్చి కొన్ని సమస్యల పైన ప్రభుత్వాన్ని ప్రశ్నించారే తప్ప ప్రజాక్షేత్రంలో తిరిగి ప్రజల మద్దతు కోసం కూడా ప్రయత్నించలేదు. పార్టీ నుండి బయటకు వెళ్లే వాళ్లను ఆపనూ లేదు. కవిత బెయిల్ పై బయటకు వచ్చిన తర్వాత కేసీఆర్ అసలు రాజకీయం మొదలు పెడతారని చర్చ జరిగింది. కేసీఆర్ తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ను, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపిని టార్గెట్ చేయాలని భావించిన కేసీఆర్ ఇప్పుడు రంగంలోకి దిగుతారని పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతుంది. బిడ్డ జైలులో ఉంటే తన గుండెల్లో అగ్నిపర్వతం బద్దలవుతోందని అయినా ఓపికగా ఎదురుచూస్తున్నానని చెప్పిన కేసీఆర్ ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పైన, దేశంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ సర్కార్ పైన సమర శంఖాన్ని పూరిస్తారని భావిస్తున్నారు.





## చెల్లి కోసం.. ఢిల్లీలో ఆటో ఎక్కిన అన్న కేటీఆర్...

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, ఆగస్టు 27: సుధీర్ఘ వాదనల అనంతరం సర్వోన్నత న్యాయ స్థానం మంగళవారం ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు చేసింది. కవిత తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. కవిత కేసులో ఈడీ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. ఇరు పక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు కవితకు బెయిల్ మంజూరు చేసింది. కాగా.. మంగళవారం రాత్రి తీహార్ జైలు నుంచి కవిత విడుదలయ్యారు. అయితే.. అంతకు ముందు బెయిల్ మంజూరు చేసిన వెంటనే.. తదుపరి పత్రాలు సమర్పించేందుకు కేటీఆర్ న్యాయవాదులతో కలిసి ఉరుకులు పరుగులు పెట్టారు. బెయిల్ ప్రక్రియను వీలైనంత పూర్తి చేసేందుకు కేటీఆర్ ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో చెల్లికోసం కేటీఆర్ ఆటో ఎక్కారు.. కవితకు బెయిల్ రావడంతో సుప్రీం కోర్టు నుంచి తిహార్ జైలుకు బయల్దేరారు. భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో కేటీఆర్ కారు వదిలి ఆటో ఎక్కారు. బెయిల్ ప్రక్రియను సాయంత్రంలోగా పూర్తి చేశారు. అన్ని ఫార్మాలిటీస్ పూర్తయిన త ర్వాతే కవిత విడుదల కాగా... కేటీఆర్, కవిత, హరీష్‌రావు ఢిల్లీలోనే ఉండి.. బుధవారం మీడి యా సమావేశం నిర్వహించనున్నారు.. అనంత రం ఇయ్యాల మధ్యాహ్నం హైదరాబాద్ కు రానున్నారు.



## ఓవైసీ అయినా, మల్లారెడ్డి అయినా అందరికీ ఒకటే రూల్

# ఎవ్వర్నీ వదలం

### రంగనాథ్ మాస్ వార్నింగ్



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, ఆగస్టు 27:హైడ్రా.. ఈ పేరు ఇప్పుడు ఒక్క హైదరాబాదే కాదు.. తెలంగాణ అంతటా మార్మోగుతోంది. చెరువుల రక్షణకు హైడ్రా చేస్తున్న చర్యలు చూసి అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. హైదరాబాద్‌లో ఎక్కడ విన్నా.. ఇదే పేరు వినిపిస్తోంది. వచ్చి రాగానే.. హైడ్రా దూకుడు ఆ విధంగా ఉంది మరి. అక్రమం అని ఎక్కడ కనిపించినా.. వినిపించినా ఉక్కుపాదం మోపుతోంది. తన, పర బేదం లేకుండా దూకుడుగా వెళ్తోంది. సలకం చెరువులో నిర్మించిన ఓవైసీ విద్యాసంస్థలపై చర్యలుండవా అంటూ నాలుగైదు రోజులుగా బీజేపీ హైడ్రాను ప్రశ్నిస్తోంది. అయితే కూల్చమని, ఓవైసీ తప్పుచేయలేదని ఎక్కడా రంగనాథ్ చెప్ప లేదు. కేవలం విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని సమయం ఇస్తామని మాత్రమే చెప్పారు. ఆసక్తికర విషయం ఏంటంటే ఓవైసీ అయినా మల్లారెడ్డి అయినా ఒకటే రూల్ అంటూ ఇంకో పేరు కూడా జత చేశారు. హైడ్రా కూల్చివేతలు తెలంగాణ రాజకీయాల్లో కాకరేపుతున్నాయి. పెద్దోళ్ల అక్రమ నిర్మాణాలు కూలిస్తే ఒకే కానీ.. పేద వారిపైనే మీ ప్రతాపమా అని ప్రభుత్వ తీరును విపక్షాలు తప్పుబడుతున్నాయి. అయితే ఎవరెంత ఒత్తిడి తెచ్చినా.. చెరువులను పరిరక్షించే విషయంలో తగ్గేదేలేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తేల్చి చెప్పేశారు. అక్రమ నిర్మాణాలు చేపట్టినవాళ్లు ఎవరైనా వదిలే ప్రసక్తే లేదని.. ఏ పార్టీకి సంబంధించిన వారు ఉన్నా వదిలేది లేదని రంగనాథ్ స్పష్టం చేశారు. ఇదిలావుంటే, అక్రమార్కులకు సింహస్వప్నంలా ఉన్న హైడ్రా..ఇకముందు ఎలాంటి టర్న్ తీసుకోనుంది. ఇప్పటిదాకా జరిగింది జస్ట్ ట్రైలర్ పార్టేనని ప్రభుత్వం చెబుతోంది. మరి ముందు ఎలాంటి సినిమా హైడ్రా చూపించబోతోంది. స్వపక్షమైనా.. విపక్షమైనా తప్పు జరిగితే తప్పించడమే అంటున్న రేవంత్ సర్కార్.. నెక్స్ట్ టార్గెట్ ఎలా ఉండబోతోంది..? అన్నదీ తెలంగాణ వ్యాప్తంగా సెన్సేషనల్‌గా మారింది.

హైదరాబాద్, రాజన్న సిరిసిల్ల, మహబూబ్ నగర్, జనరల్

ఈ-పేపర్ తెలుగు డైలీ

ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/

# ఆ బాలుడి చికిత్స తమదే బాధ్యత!.. సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, ఆగస్టు 27:జన్యు సంబంధిత వ్యాధితో బాధపడుతోన్న రెండున్నరేండ్ల చిన్నారి చికిత్సకు నిధులు విడుదల చేసి, ఆపరేషన్ కు ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. తింటే అరగదు.. వదిలేస్తే ప్రాణం నిలవదు! అని ఓ దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు ఇచ్చారు. జనగామ జిల్లా జఫర్ గఢ్ మండలం తిమ్మంపేటకు చెందిన కుంభోజు మహేశ్వర్-అలేఖ్య దంపతుల రెండున్నరేళ్ల కుమారుడు మాధవన్ జన్యు సంబంద వ్యాదితో బాధపడుతున్నాడు. ఆ బాలుడికి 15 రోజులకు ఒకసారి రూ.1.24 విలువైన ఇంజెక్షన్ ఇవ్వాలి. బాలుడికి బోన్ మ్యారో శస్త్రచికిత్స చేయాల్సి ఉంది. దానికి రూ. 24 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. దీంతో పేదరికంలో ఉన్న తల్లిదండ్రులు దాతల కోసం ఎదురుచూస్తున్నారు. దీనిపై వార్తా పత్రికల్లో వచ్చిన కథనానికి ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించి, తక్షణ సాయానికి ఆదేశించింది. ఆ మేరకు సంబంధిత అధికారులు బాలుడి తల్లిదండ్రులను సంప్రదించి, వారి సమ్మతితో హైదరాబాద్ నిమ్స్ వైద్యులతో మాట్లాడి, చికిత్సకు ఏర్పాట్లు చేశారు. ఆపరేషన్ కు అవసరమయ్యే నిధులను ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా అందించాలని నిర్ణయించారు.



# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై సీఎం తో చర్చించి పరిష్కరిస్తా

## జీహెచ్ జే సొసైటీ నేతలకు మంత్రి పొన్నం హామీ



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్ ఆగస్టు 27: జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశాన్ని ముఖ్యమంత్రి, మంత్రి మండలి దృష్టికి తీసుకువెళ్ళి త్వరలో సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర బీసీ సంక్షేమ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ లో పనిచేస్తున్న జర్నలిస్టులు సభ్యులుగా ఉన్న తమ సొసైటీకి ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటీవ్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు మంగళవారం సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసి కోరారు. సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ లు మంత్రికి జర్నలిస్టుల ఇళ్లస్థలాల సమస్యను వివరించారు. తమ సొసైటీలో దాదాపు 1400 మంది జర్నలిస్టులున్నారని, వీరిలో చాలా మంది సీనియర్ జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం చాలా ఏళ్ళుగా ఎదురు చూస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలయాపన చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులంతా తమకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందన్న నమ్మకంతో ఉన్నారని మంత్రితో అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ,అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు ఇస్తామని అన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళి కేబినెట్ ఆమోదం ద్వారా అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలిస్తామని అన్నారు. మంత్రిని కలిసిన వారిలో సొసైటీ ప్రతినిధులు పులిపలుపుల ఆనందం, సీతారామరాజు, వీరారెడ్డి, పి.నాగవాణి, వేముల పుష్పలత, డి. వెంకట్ రెడ్డి తదితరులున్నారు.

# తెలంగాణ ప్రజలకు ఐటీ మంత్రి విజ్ఞప్తి.. ఏమన్నారంటే..



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్ , ఆగస్టు 27:మట్టి విగ్రహాలు వినియోగించి సహకరించాలని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు ప్రజలని విజ్ఞప్తి చేశారు. గణేష్ ఉత్సవాలకు సంభందించి వివిధ శాఖలతో సమావేశం నిర్వహించామన్నారు. పోలీస్, ఫైర్, హెల్త్, జీహెచ్ఎంసీ కి సంభందించిన సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు. ప్రతి సంవత్సరం గణేష్ ఉత్సవం ఎంతో ముఖ్యమైనదన్నారు. వివిధ ఉత్సవ కమిటీ కి సంభంధించిన నిర్వాహకులు ఈ సమావేశం లో పాల్గొన్నారని తెలిపారు. వారు గతం లో ఎదురుకున్నా చిన్న చిన్న ఇబ్బందులను మా దృష్టికి తెచ్చారన్నారు. వాటిని పునరావృతం కాకుండా చూడాలని అధికారులను అదేశించామన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ , కరెంట్ ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించామన్నారు. అందరినీ కలుపుకొని ఈ ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలని నిర్ణయించామన్నారు. అందరు కూడా సహకరించి ముందుకు వెళతామని వారు తెలియజేశారన్నారు. పొల్యూషన్ నీ దృష్టిలో పెట్టుకుని మట్టి విగ్రహాలు పెట్టేలా ప్రోత్సహించాలని నిర్ణయించామన్నారు. అందరికీ మట్టి విగ్రహాలు అందుబాటులో ఉండేలా చూడాలని అదేశించామన్నారు. మట్టి విగ్రహాల ఉపయోగంపై పెద్ద ఎత్తున క్యాంపెయిన్ చేయాలని నిర్ణయించామని తెలిపారు. మట్టి విగ్రహాలు వినియోగించి సహకరించాలని ప్రజలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

# కవితకు బెయిల్ రావడంపై బండి సంజయ్ ట్వీట్... తీవ్రంగా స్పందించిన కేటీఆర్



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్ , ఆగస్టు 27:బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మంగళవారం సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంపై కేంద్ర సహాయ మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ చేసిన ట్వీట్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బండి సంజయ్ ట్వీట్‌ను తప్పుబట్టారు. కవితకు బెయిల్ లభించినందుకు కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీ న్యాయవాదులకు అభినందనలు అంటూ బండి సంజయ్ ట్వీట్ చేశారు. ఈ వ్యాఖ్యలపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. బండి సంజయ్ కేంద్ర హోంశాఖ వ్యవహారాల ఇంఛార్జ్‌గా ఉన్నారని, మరోవైపు సుప్రీంకోర్టు తీర్పుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని ఎక్స్ వేదికగా కేటీఆర్ పేర్కొన్నారు. మీ స్థాయికి ఇది తగిన వైఖరి కాదని బండి సంజయ్‌ని ఉద్దేశించి పేర్కొన్నారు. గౌరవనీయులైన భారత ప్రధాన న్యాయమూర్తి, గౌరవ సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలను (బండి సంజయ్ వ్యాఖ్యలను) కోర్టు ధిక్కార చర్యగా భావించి అందుకు అనుగుణంగా చర్యలను ప్రారంభించాలని కోరుతున్నానని పేర్కొన్నారు. అంతకుముందు, కేటీఆర్ మరో ట్వీట్ చేశారు. కవితకు బెయిల్ రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. "థ్యాంక్యూ, సుప్రీంకోర్ట్... ఉపశమనం లభించింది, న్యాయం గెలిచింది" అని ట్వీట్ చేశారు.

# వేములవాడ ముస్లిం కమిటీ పూర్తిస్థాయి కార్యవర్గం నియామకం



ఇయ్యాల్టి న్యూస్, వేములవాడ, ఆగస్టు 27:రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణ ముస్లిం కమిటీ పూర్తిస్థాయి కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. పట్టణ ముస్లిం కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అక్రమ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి షాహిద్ పాషా, కోశాధికారి ముషాహీద్ లతో కలసి పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ప్రకటించారు. మొత్తం 30 మందితో కూడిన కమిటీని ప్రతినిధుల పేర్లను విడుదల చేశారు. గౌరవ అధ్యక్షులుగా సయ్యద్ లాయక్ పాషా, ఉపాధ్యక్షులుగా మొహమ్మద్ అజీమ్, అబ్దుల్ రజాక్, షబ్బీర్ అలీ, సయ్యద్ ఉమర్, ముఖ్య సలహాదారులుగా ఎండి అమానుల్లా ఖాన్, ఏంఏ,మన్నాన్,యం.ఏ కలీం పాషా,షేక్ బాబున్,యండి.పీర్ మొహమ్మద్, ఎండి సలీం, షేఖ్ సాబిర్, షేక్ రియాజ్, ఏం ఏ రాహిల్,జాయింట్ సెక్రటరీలుగా వహీదోద్దీన్ పర్వేజ్, షేక్ అబ్దుల్ రెహమాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సయ్యద్ ఫహాద్ పాషా, అబ్దుల్ రాహిల్ (సోహెల్), మహమ్మద్ అజీమ్, కార్యవర్గ సభ్యులుగా మహమ్మద్ మజాహర్ పాష,షేక్ అలీ, మొహమ్మద్ అఫ్సర్, ఎండి షకిల్, మొహమ్మద్ సయ్యద్ పాషా, మొహమ్మద్ షహబాజ్, మహమ్మద్ ఇమ్రాన్,సయ్యద్ సలీం పాషా లను ఎన్నుకున్నట్లు వారు ప్రకటించారు..

# రేవంత్ రెడ్డీ... ఒవైసీ బ్రదర్స్ కు భయపడకుండా దానిని కూల్చేయ్: సీఎంకు రాజాసింగ్ మద్దతు



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్ , ఆగస్టు 27:ఒవైసీ సోదరులు ఫాతిమా కాలేజీని చెరువులో అక్రమంగా నిర్మించారని, వారి బెదిరింపులకు భయపడవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ మద్దతు పలికారు. చెరువులు, కుంటలను ఆక్రమించి జరిగిన నిర్మాణాలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే.ఇప్పటికే నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ సహా పలు కట్టడాలను హైడ్రా కూల్చివేసింది. ఇదే సమయంలో ఒవైసీ సోదరులకు చెందిన ఫాతిమా కాలేజీపై కూడా ఆరోపణలు వచ్చాయి. చెరువును ఆక్రమించి నిర్మించిన ఈ కాలేజీని కూల్చేయాలని పెద్ద ఎత్తున డిమాండ్లు, ఫిర్యాదులు వచ్చాయి.దీంతో అక్బరుద్దీన్ ఒవైసీ స్పందించారు. కావాలంటే తనపై మరోసారి బుల్లెట్ల వర్షం కురిపించవచ్చునన్నారు. కానీ ఆ స్కూల్‌ను మాత్రం కూల్చవద్దని విజ్ఞప్తి చేశారు. పేదలకు ఉచిత విద్య అందించేందుకు 12 భవనాలు నిర్మించామని, వీటిని కావాలని కొందరు తప్పుగా చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తనపై కాల్పులు జరిగాయని, కావాలంటే మళ్లీ బుల్లెట్ల వర్షం కురిపించుకోవచ్చునన్నారు. అవసరమైతే తనపై కత్తులతో దాడి చేయండి... కానీ పేదల విద్యాభివృద్ధి కృషికి అడ్డుపడకండన్నారు.అక్బరుద్దీన్ వ్యాఖ్యలపై రాజాసింగ్ స్పందించారు. చెరువులను కాపాడాలని ముఖ్యమంత్రి సంకల్పం తీసుకోవటం అభినందనీయమని ప్రశంసించారు. రేవంత్ రెడ్డి సంకల్పం పూర్తి కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఒవైసీ బ్రదర్స్ బెదిరింపులకు భయపడొద్దని సూచించారు. వేలమంది యువత భవిత అంటూ బెదిరిస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి మాదిరిగానే... భయపడకుండా రేవంత్ రెడ్డి ముందుకెళ్ళాలని సూచించారు.

## అంతిమ సంస్కారాలకు అండగా నిలిచి...

# మానవత్వం చాటుకున్న వేములవాడ ఛారిటబుల్ ట్రస్ట్



ఇయ్యాల్టి న్యూస్,వేములవాడ, ఆగస్టు 27:అంతిమ సంస్కారాలు చేయలేని దుస్థితిలో ఉన్న ఓ కుటుంబానికి అం డగా నిలిచారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణం న్యూ అర్బన్ కాలనీ లోని వడ్డెర కులానికి చెందిన దండుగుల అశోక్ (40) అనారోగ్యం తో మృతి చెందాడు. రెక్కాడితే కానీ డొక్కాడని ఆ కుటుంబం పెద్దదిక్కును కోల్పోయి దహన సంస్కారాలకు కూడా డబ్బులు లేని దుస్థితి ఏర్ప డింది.ఈ విషయాన్ని తెలుసుకున్న వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మనవతా దృ క్పదంతో స్పందించి దాతల సాయంతో రూ. 10వేల నగదు బాధిత కుటుంబసభ్యలకు అందజేశారు.ఈ కార్య క్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్, గొంగళ్ళ రవి కుమార్, పొలాస రాజేందర్, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, హోమ్ గార్డ్ ఉప్పరపెల్లి శైలజ తదితరులు ఉన్నారు.



## నల్లకుంటలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పర్యటన... సమస్యలపై ఆరా

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, ఆగస్టు 27: అంబర్ పేట నియోజకవర్గం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ నల్లకుంట డివిజన్ లో పర్యటించారు. మంగళవారం టీఆర్టీ క్వార్టర్స్ లో పాదయాత్ర నిర్వహించి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. తన దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఆయన స్థానికులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ఏఎంహెచ్ వో హేమలత, విద్యుత్ ఏఈ పృథ్వీరాజ్, హార్టికల్చర్ విభాగం మేనేజర్ భాస్కర్, ఏఈ ఫైయాజ్ తదితరులు ఉన్నారు.

## యాదవ మహాసభ శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో

# బీజేపీ నేత ఏడెల్లి అజయ్ కుమార్



ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, ఆగస్టు 27: హైదరాబాద్ గొలిగూడలో యాదవ మహాసభ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. మహాసభ ప్రతినిధి సందీప్ యాదవ్ ఆహ్వానం మేరకు ఈ వేడుకల్లో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ ఏడెల్లి అజయ్ కుమార్ పాల్గొన్నారు.

# రేపు శ్రీశైలంలో స్వర్ణరథోత్సవం..ప్రకటించిన దేవస్థానం



ఇయ్యాల్టి న్యూస్,ఏపీ, ఆగస్టు 27:ఏపీ నంద్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలో రేపు 29న బంగారు స్వర్ణరథోత్సవం నిర్వహించనున్నట్లు దేవస్థానం ప్రకటించింది. దేవస్థానం వైదిక కమిటీ సూచనతో ప్రతీ మాసంలో శ్రీస్వామి అమ్మవార్ల స్వర్ణరథోత్సవం నిర్వహిస్తున్నారు. 29న ఆరుద్ర నక్షత్రం రోజే శ్రీస్వామి అమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహణకు దేవస్థానం నిర్ణయం తీసుకుంది. 29న మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం,అన్నాభిషేకం మాడవీధులలో స్వర్ణరథంపై స్వామివారు విహరించనున్నారు. బంగారు స్వర్ణరథంపై ఆది దంపతులు భక్తులకు దర్శనమివ్వనున్నారు. 11 కోట్ల స్వర్ణరథాన్ని పోయిన ఫిబ్రవరిలో అప్పటి రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దేవస్థానానికి విరాళంగా అందజేసిన విషయం తెలిసిందే. ఆ స్వర్ణరథంపై ఈనెల 29న స్వామివారు విహరించనున్నారు.



## శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో బీజేపీ నేత యశ్వంత్

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, ఆగస్టు 27:విశ్వహిందూ పరిషత్ 60 వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంబర్ పేట డివిజన్ అన్నపూర్ణనగర్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ సీనియర్ నేత యశ్వంత్ హాజరై.. హిందూ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. హిందూ బంధువులు అజయ్, శశిధర్, రవి, జశ్వంత్ తదితరులు ఉన్నారు.


## రాజ్యసభ సభ్యుడిగా

# అభిషేక్ మను సింఘ్వీ ఏకగ్రీవం



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్ , ఆగస్టు 27:రాజ్యసభ సభ్యుడిగా అభిషేక్ మను సింఘ్వీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రం నుంచి పోటీలో మరెవరూ లేకపోవడంతో సింఘ్వీ ఎన్నిక ఏకగ్రీవమైంది. కాంగ్రెస్ నేత నిరంజన్ ధృవీకరణ పత్రం తీసుకున్నారు. కాగా, ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన కేశవరావు రాజీనామాతో తెలంగాణలో రాజ్యసభ స్థానం ఖాళీ అయిన విషయం తెలిసిందే. దేశ వ్యాప్తంగా రాజ్యసభలో ఖాళీ అయిన మొత్తం 12 స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి. అస్సాం, బిహార్, హర్యానా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, త్రిపుర రాష్ట్రాల నుంచి 10 మంది సభ్యులు లోక్‌సభకు ఎన్నిక అయ్యారు. ఇక తెలంగాణ, ఒడిశా నుంచి ఒక్కొక్కరు తమ రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఉప ఎన్నికల నిర్వహణ అనివార్యమైంది. ఈ క్రమంలోనే తెలంగాణ నుంచి పోటీ చేసిన సింఘ్వీ ఏకగ్రీవంగా రాజ్యసభకు ఎన్నికయ్యారు.

# ఫ్లాట్ గా ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు




ఇయ్యాల్టి న్యూస్,బిజినెస్ ఆగస్టు 27:భారత స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం ఫ్లాట్ గా ముగిశాయి. సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. అంతర్జాతీయంగా సానుకూల, ప్రతికూల సెంటిమెంట్ల ప్రభావం భారత మార్కెట్ పై పడింది. సెన్సెక్స్ 13.65 పాయింట్ల వృద్ధితో 81,711 వద్ద ముగిసింది. నిఫ్టీ 7 పాయింట్ల స్వల్ప లాభంతో 25,017 వద్ద స్థిరపడింది. వరుసగా రెండో రోజు కూడా నిఫ్టీ 25 వేలకు ఎగువన ముగియడం విశేషం. కాగా, ట్రేడింగ్ పై నిపుణులు స్పందిస్తూ, మదుపరులు ప్రాఫిట్ బుకింగ్ కు మొగ్గుచూపడంతో సూచీలు ఫ్లాట్ గా ముగిశాయని వివరించారు. సెప్టెంబరులో వడ్డీ రేట్ల సవరణ ఉంటుందని అమెరికా ఫెడరల్ రిజర్వ్ ప్రకటన ఓవైపు, అంతర్జాతీయంగా నెలకొన్న రాజకీయ, భౌగోళిక సంక్షోభాలు మరోవైపు స్టాక్ మార్కెట్ తీరుతెన్నులను శాసించాయని పేర్కొన్నారు. ఇక, మంగళవారం ట్రేడింగ్ లో బజాజ్ ఫిన్ సెర్వ్, మారుతి సుజుకి, ఎల్ అండ్ టీ, బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫోసిస్, ఐసీఐసీఐ బ్యాంక్, సన్ ఫార్మా, యాక్సిస్ బ్యాంక్, భారతి ఎయిర్ టెల్ షేర్లు లాభాలు అందుకున్నాయి.

# 3 గ్లాసుల వైన్ లేదా ఒక ముద్దు..! ఆఫీస్ పార్టీలో గేమ్ రూల్ విన్న అమ్మాయికి షాక్



ఇయ్యాల్టి న్యూస్, క్రైం, ఆగస్టు 27: ఆధునిక కాలంలో కొన్ని ఆఫీసులు, కంపెనీలు తమ ఉద్యోగుల కోసం పార్టీలను నిర్వహిస్తాయి. మహిళా ఉద్యోగులు కూడా ఇలాంటి పార్టీల్లో పాల్గొంటారు. అటువంటి పార్టీలలో ఆల్కహాల్‌తో పాటు అన్ని రకాల ఫుడ్ఐటమ్స్, స్పెషల్ డ్రింక్స్ కూడా ఏర్పాటు చేస్తుంటారు. ఇకపోతే, ఇప్పుడు మహిళలు కూడా మేం ఎందులోనూ తక్కువ కాదు అన్నట్టుగా మందుకు అలవాటు పడ్డారు. అయితే ఓ కంపెనీ ఏర్పాటు చేసిన పార్టీలో వేసిన గేమ్ ప్లాన్ చూసి ఓ మహిళా ఉద్యోగిని షాక్కు గురైంది. అక్కడ జరిగిన మోసానికి ఆ మహిళ కన్నీళ్లు పెట్టుకుంది. చైనాలో జరిగిన ఓ యువతికి ఎదురైన చేదు అనుభవాన్ని ఆమె సోషల్ మీడియా ద్వారా ప్రపంచానికి తెలిసేలా వివరించింది. ఆఫీస్ పార్టీలో తమకు ఎదురైన చేదు అనుభవాల గురించి మహిళలు సోషల్ మీడియాలో రాసుకున్న అలాంటి ఘటనే ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. మహిళా ఉద్యోగులను 'టీమ్ బిల్డింగ్ ఈవెంట్' కార్యక్రమానికి ఆహ్వానించారు. అయితే ఈ కార్యక్రమానికి వెళ్లిన తర్వాత అక్కడ తమకు ఎదురైన అనుభవాలపై మహిళలు అసహనం వ్యక్తం చేశారు. దీనిపై సోషల్ మీడియాలో తీవ్ర దుమారం మొదలైంది. ఈ కంపెనీలో ఒక అమ్మాయి ఇంటర్న్‌గా పనిచేసేది. టీమ్ బిల్డింగ్ ఈవెంట్‌కి తనను కూడా ఆహ్వానించారు. ఆ ఈవెంట్‌కి వెళ్లకపోతే ఏమవుతుందోనని, ఈవెంట్‌కు ఎందుకు రాలేదని కంపెనీ అడిగితే తను అందరి దృష్టిలో పడాల్సి వస్తుందని ఆ అమ్మాయి భయపడింది. అందుకే తను కూడా ఆ కార్యక్రమంలో పాల్గొంది. అయితే అక్కడికి వెళ్లిన తర్వాత జరిగిన సంఘటనతో ఆ యువతి షాక్‌కు గురైంది. టీమ్ బిల్డింగ్ ఈవెంట్ పేరుతో అక్కడ కొన్ని రకాల గేమ్ ఛాలెంజ్‌లు పెట్టారు. అందులో భాగంగా మూడు గ్లాసుల మద్యం తాగాలని, లేదంటే, ఆమె తండ్రి వయసున్న వ్యక్తికి ముద్దియ్యాల్సి ఉంటుందని కండీషన్ పెట్టారు.. దీంతో ఒక్కసారిగా కంగుతిన్న ఆ యువతి.. ఈ గేమ్ ఆడేందుకు నిరాకరించడంతో ఆ వ్యక్తి ఆమె చేయి పట్టుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. చివరికి ఆ అమ్మాయి ఏడుస్తూ మూడు గ్లాసుల వైన్ తాగింది.



# పుతిన్‌తో మాట్లాడిన ప్రధాని మోదీ.. ఉక్రెయిన్ పర్యటనపై చర్చ

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఆగస్టు 27: ప్రధాని నరేంద్రమోదీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో టెలిఫోన్‌లో మాట్లాడారు. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలతో పాటు ఇటీవల జరిగిన ఉక్రెయిన్ పర్యటనపై ఇరు నేతలు చర్చించారు. " ఈరోజు అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడారు. ప్రత్యేక మరియు విశేష వ్యూహాత్మక భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేయడానికి చర్యల గురించి చర్చించాము. రష్యా- ఉక్రెయిన్ వివాదంపై ఇటీవలి ఉక్రెయిన్ పర్యటన గురించి మాట్లాడాను. ఈ సంఘర్షణపై స్థిరమైన మరియు శాంతియుత పరిష్కారానికి మద్దతు ఇవ్వడానికి భారతదేశం యొక్క దృఢ నిబద్ధతను పునరుద్ఘాటించాను." అని ప్రధాని మోడీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ పోలాండ్‌తో పాటు ఉక్రెయిన్ పర్యటనకు వెళ్లారు. ఆ దేశ అధ్యక్షుడు వొలోడిమిర్ జెలన్‌స్కీతో చర్చించారు. సంఘర్షణను దౌత్యం, చర్యల ద్వారా పరిష్కరించుకోవాలని మరోసారి మోడీ పునరుద్ఘాటించారు. ఇదిలా ఉంటే, మరోవైపు అమెరికా అధ్యక్షుడు జోబైబెన్‌తో కూడా మోడీ టెలిఫోన్‌లో మాట్లాడారు. ఉక్రెయిన్ పర్యటన విషయాలను పంచుకున్నట్లు తెలుస్తోంది.

# ఛీ నువ్వు తల్లివేనా..? లవర్‌తో లేచిపోయేందుకు కూతుర్ని చంపేసింది..





ఇయ్యాల్టి న్యూస్, క్రైం, ఆగస్టు 27: సభ్యసమాజం తలదించుకునేలా చేసింది ఓ తల్లి. పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన తల్లి, 3 ఏళ్ల చిన్నారిని అత్యంత దారుణంగా గొంతు కోసి చంపింది. ప్రియుడితో వెళ్లేందుకు ఈ ఘతుకానికి పాల్పడింది. బీహార్ ముజఫర్‌పూర్‌లో సూట్‌కేస్‌లో మూడేళ్ల బాలిక మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న తర్వాత, పోలీస్ దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. వివాహేతర సంబంధం పెట్టుకున్న కాజల్ అనే మహిళ, తన భర్తను విడిచిపెట్టి ప్రియుడితో వెళ్లిపోవాలని భావించింది. ఇందుకు అడ్డుగా ఉన్న తన కుమార్తెని పాశవికంగా హత్య చేసింది.ప్రియుడు తన కుమార్తెతో ఉండేందుకు ఇష్టపడకపోవడంతోనే హత్య చేసినట్లు ఆమె ఒప్పుకుంది. చిన్నారి గొంతు కోసి, మృతదేహాన్ని సూట్‌కేసులో పెట్టి పొదల్లో పారేసింది. అయితే, ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే, పాపులర్ టీవీ షో " క్రైమ్ పెట్రోల్" చూసి తన కూతురిని హత్య చేయడానికి ప్లాన్ చేసినట్లు చెప్పడంతో పోలీసులు కంగుతిన్నారు.శనివారం ముజఫర్‌పూర్‌లోని మినాపూర్ పరిసరాల్లో రెడ్ ట్రాలీ సూట్‌కేసులో మూడేళ్ల మిస్తీ అనే బాలిక మృతదేహం లభించింది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. హత్యని దర్యాప్తు చేసేందుకు పోలీసులు స్పెషల్ టీమ్స్ ఏర్పాటు చేశారు. ఫోరెన్సిక్ టీములను రంపించి విచారణ వేగవంతం చేశారు. బాలిక కుటుంబంపై అనుమానంతో వారి ఇంటిని సోదా చేయగా నేలపై, సింక్, టెర్రస్‌పై రక్తపు ఆనవాళ్లు కనిపించాయి. మిస్తీ తల్లి కాజల్ కనిపించకుండా పోయిందని, ఘటన జరిగిన రోజు భర్త మనోజ్‌కి ఫోన్ చేసి పుట్టింటికి వెళు_న్నట్లు చెప్పిందని పోలీసులు గుర్తించారు.మనోజ్ తన భార్య కాజల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కాజల్ ఫోన్ లొకేషన్ ట్రాక్ చేయడంతో ఆమె తన ప్రియుడి ఇంట్లో దొరికింది. విచారణతో కాజల్‌కి వివాహేతర సంబంధం ఉన్నట్టు తేలింది. తన ప్రియుడితో కలిసి ఉండేందుకు బిడ్డను అడ్డు తొలగించుకున్నట్లు చెప్పింది. కూతురిని తీసుకుని వెళ్లాలనుకున్నప్పటికీ ప్రియుడు దీనికి ఒప్పుకోకపోవడంతో కత్తితో గొంతు కోసింది. హత్య ఆనవాళ్లు చెరిపేసేందుకు రక్తపు మరకలను తొలగించాలని చూసింది. క్రైమ్ పెట్రోల్ షో చూసే అలవాటు ఉన్న కాజల్, ఓ ఎపిసోడ్‌లో చూసిన విధంగా బిడ్డను చంపి, సూట్‌కేస్‌లో పెట్టినట్లు తేలింది. అయితే, ఈ హత్యలో ఆమె ప్రియుడి ప్రమేయం ఉన్నట్లుగా, ఇందుకు అతను ప్రభావితం చేసినట్లుగా తేలలేదని పోలీస్ అధికారులు వెల్లడించారు.




# కోల్‌కతా డాక్టర్ కేసులో బిగ్ ట్విస్ట్.. సీపీ బైక్ వాడిన నిందితుడు..!

ఇయ్యాల్టి న్యూస్, క్రైం, ఆగస్టు 27: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో జూనియర్ డాక్టర్‌పై జరిగిన దారుణమైన అత్యాచారం- హత్య కేసులో నిందితుడైన సంజయ్ రాయ్ ఉపయోగించిన బైక్ కోల్‌కతా కమీషనర్ ఆఫ్ పోలీస్ పేరుతో రిజిస్టర్ చేయబడిందని తేలింది. అయితే, నిందితుడు కోల్‌కతా పోలీస్‌లో పౌర వాలంటీర్‌గా కొనసాగుతున్నాడు. ఇక, నేరం జరిగిన రోజు ఉత్తర కోల్‌కతాలోని రెడ్ లైట్ ఏరియాలను సందర్శించడానికి ఈ బైక్ ను ఉపయోగించినట్లు వెల్లడైంది. నిందితుడు సంజయ్ రాయ్ మద్యం మత్తులో 15 కిలో మీటర్ల దూరం పాటు బైక్‌ను నడిపినట్లు తెలుస్తుంది. అయితే, కోల్‌కతా సీనియర్ పోలీసు అధికారులతో సంజయ్ రాయ్‌కి ప్రోత్సాహకాలు అందించిన అధికారులపై సరైన చర్యలు తీసుకున్నారా అనే విషయంపై ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం రాలేదు. కాగా, ఈ బైక్‌కు సంబంధించిన వివరాలు ప్రస్తుతం బయటకు వచ్చాయి. ఇది 2014లో ప్రస్తుత కమిషనర్ పేరుపై రిజిస్టర్ అయినట్లు తెలుస్తుంది. అత్యాచారం- హత్య కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ ఈ వాహనాన్ని స్వాధీనం చేసుకుంది.

# భార్య చేసే ఖర్చులు భరించలేక.. రోడ్డు యాక్సిడెంట్‌లో చంపేసిన భర్త!





ఇయ్యాల్టి న్యూస్, క్రైం, ఆగస్టు 27: మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. విలాసవంతమైన జీవనశైలికి అలవాటుపడి ఎక్కువ మొత్తంలో డబ్బు ఖర్చుచేస్తున్న భార్యతో ఓ భర్త వేగలేక పోయాడు. పక్కా ప్లానుతో భార్యను కడతేర్చి, రోడ్డు యాక్సిడెంట్‌గా నమ్మబలికాడు. పోలీసుల ఎంట్రీతో అడ్డంగా బుక్కైపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ నివాసం ఉంటున్న హేమంత్ శర్మ, దుర్గావతిలకు 2021లో వివాహేతర సంబంధం ఏర్పడింది. అయితే అప్పటికే వేర్వేరు వ్యక్తులతో ఇద్దరికీ పెళ్లిళ్లు జరిగాయి. హేమంత్ పెళ్లయిన ఏడాదికే భార్యతో విడిపోగా.. భర్త నుంచి విడాకులు తీసుకొన్న దుర్గావతి.. 2022లో వివాహం చేసుకున్నారు. చట్టబద్ధంగా దుర్గావతికి విడాకులు మంజూరైన తర్వాత 2023లో అధికారికింగా హేమంత్ శర్మ, దుర్గావతి మరోమారు పెళ్లి చేసుకున్నారు. అయితే దుర్గావతి విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి విపరీతంగా డబ్బు ఖర్చు పెట్టేది. దీంతో శర్మ ఆర్థికంగా బాగా దెబ్బతిన్నాడు. దీంతో వీరి మధ్య పొరపొచ్చాలు వచ్చాయి. దుర్గావతి తీరుతో విసుగు చెందిన శర్మ ఆమెను అంతమొందించాలని పథకం పన్నాడు. స్నేహితుడు, మరో వ్యక్తితో కలిసి ప్లాన్ అమలు చేశాడు. అందుకు ఏకంగా రూ. 2.5 లక్షలు సుపారీ కూడా ఇచ్చాడు.ఆగస్టు 13న శర్మ.. తన భార్య దుర్గావతి, ఆమె సోదరుడు సందేశ్‌ను తీసుకుని ఓ గుడికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా శర్మ ముందుగా ఏర్పాటు చేసిన ఇద్దరు వ్యక్తులు దుర్గావతి, సందేశ్‌లు ప్రయాణిస్తున్న బైక్‌ను ఉద్దేశ్యపూర్వకంగా కారుతో ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో దుర్గావతి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించగా, సందేశ్‌కు గాయాలయ్యాయి. తొలుత దీనిని హిట్ అండ్ రన్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు 10 రోజుల తర్వాత అసలు విషయం వెలికి తీశారు. పొంతనలేని శర్మ మాటలపై అనుమానం వచ్చిన పోలీసులు.. పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా అసలు విషయం బయటపడింది. ప్రమాదం జరగడానికి కొద్దిసేపటి ముందు బైకును అనుసరిస్తున్న కారు కనిపించింది. దీంతో హత్యోదంతం మిస్టరీ వీడింది. ఈ హత్య కేసులో శర్మతో సహా కారుతో ఢీ కొట్టిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు నిందితులుగా గుర్తించినట్లు అడిషనల్ పోలీసు సూపరింటెండెంట్ నిరంజన్ శర్మ మీడియాకు తెలిపారు. శర్మ, కారు డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేయగా.. మరొకరు పరారీలో ఉన్నారు.





# హిందూ మహాసముద్రంలో ఉద్రిక్తత..

## ఎదురుపడిన భారత్- చైనా నౌకాదళాలు..

ఇయ్యాల్టి న్యూస్,వెబ్ డెస్క్, ఆగస్టు 27: హిందూ మహాసముద్రంలో తన ఆధిపత్యాన్ని నెలకొల్పేందుకు చైనా ట్రై చేస్తుంది. డ్రాగన్ కంట్రీ యొక్క దుర్మార్గపు ప్రణాళికలను విఫలం చేయడానికి భారతదేశం కూడా విభిన్న వ్యూహాలను రచిస్తోంది. ఇందులో భాగంగానే, భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ ముంబై మూడు రోజుల ప్రయాణం తర్వాత సోమవారం శ్రీలంకలోని కొలంబో పోర్టుకు చేరుకోగా.. ఈ ఐఎన్ఎస్ ముంబై డిస్ట్రాయర్ షిప్ లో 163 మీటర్ల పొడవు, 410 మంది సిబ్బంది ఉండొచ్చని తెలిపింది. భారత నావికాదళానికి చెందిన ఈ యుద్ధనౌక తొలిసారిగా శ్రీలంకకు చేరుకుందని భారత హైకమిషన్ కూడా తెలియజేసింది. అయితే, అదే సమయంలో మూడు చైనా యుద్ధ నౌకలు సైతం శ్రీలంకకు చేరుకున్నాయి.ఐఎన్ఎస్ ముంబై చైనా యుద్ధనౌకలు.. శ్రీలంక యుద్ధనౌకలతో విడివిడిగా "పాసేజ్ ఎక్సర్‌సైజ్‌లు" నిర్వహించనుందని డిస్ట్రాయర్ ఐఎన్ఎస్ ముంబై కెప్టెన్ సందీప్ కుమార్ వెల్లడించారు. అదే సమయంలో క్రీడలు, యోగా, బీచ్ క్లీనింగ్ వంటి ఉమ్మడి కార్యక్రమాల్లో మూడు దేశాల నౌకాదళాలు పాల్గొంటాయి.

# "వాహ్..దీదీ.. రేపిస్టులకు సాయం చేయడం గౌరవం?.. మహిళల భద్రతపై ప్రశ్నించడం నేరమా?": నడ్డా



ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ ఆగస్టు 27: కోల్ కతా ట్రైనీ డాక్టర్ అత్యాచారం, హత్య కేసుపై దేశ వ్యాప్తంగా విద్యార్థుల నిరసనలు కొనసాగుతున్న వేళ కోల్ కతా మాంత్రం అట్టుడికి పోతుంది. విద్యార్థులు మరోసారి పెద్ద సంఖ్యలో రోడ్లపైకి వచ్చారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేస్తున్నారు. విద్యార్థులు ఇప్పటికే 'నబన్న అభియాన్' కింద.. అంటే సెక్రటేరియట్ ముట్టడించారు. దీన్ని అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉదయం నుంచే పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మోహరించింది. హౌరా బ్రిడ్జికి సీలు వేసింది. బ్రిడ్జిపై ఇనుప గోడను నిర్మించారు. పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా స్పందించారు. ఈ నిరసన కవాతు సందర్భంగా.. విద్యార్థులపై పోలీసుల చర్యలను ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా.. ఎక్స్ లో ఓ పోస్ట్ చేశారు. దీదీ.. పశ్చిమ బెంగాల్‌లో, రేపిస్టులు, నేరస్థులకు సహాయం చేయడం గర్వకారణం. కానీ.. మహిళల భద్రత కోసం మాట్లాడటం, ప్రశ్నించడం నేరమా? అని ప్రశ్నించారు. మరోవైపు హత్యాచార ఘటనను నిరసిస్తూ ఆందోళన చేస్తున్న జూనియర్ వైద్యులు.. ఈ నిరసనలకు దూరంగా ఉన్నారు. ఛాత్ర సమాజ్ తో తమకు ఎలాంటి సంబంధం లేదని ప్రకటించిన జూనియర్ వైద్యులు ప్రకటించారు. బుధవారం కోల్‌కతాలో ర్యాలీకి పిలుపునిచ్చారు. మరోవైపు, ఈ విద్యార్థి సంఘం ఆందోళనలకు బీజేపీ మాత్రమే మద్దతు ఇచ్చింది.

# నిబంధనల మేరకే ఖర్గే కుటుంబసభ్యుల ట్రస్ట్‌కు భూ కేటాయింపు : సిద్ధరామయ్య



ఇయ్యాల్టి న్యూస్, బెంగుళూరు, ఆగస్టు 27: బెంగళూర్‌కు సమీపంలోని ఏరోస్పేస్ పార్క్‌లో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే కుటుంబానికి చెందిన ట్రస్ట్‌కు ప్లాట్ కేటాయించడంపై కర్నాటక సీఎం సిద్ధరామయ్య స్పందించారు. అధికారులు నిబంధనల మేరకే సదరు ట్రస్ట్‌కు భూమి కేటాయించారని, అర్హతలు, విధి, విధానాలను అనుసరించారని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కాషాయ పాలకులు చాణక్య యూనివర్సిటీకి భూములు కేటాయించారని ఆరోపించారు. కాగా, బెంగళూర్‌కు సమీపంలోని ఓ ఏరోస్పేస్ పార్క్‌లో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే కుటుంబానికి చెందిన ఓ ట్రస్ట్‌కు 5 ఎకరాల భూ కేటాయింపునకు ఆమోదం లభించడం పెను దుమారం రేపుతోంది. ఖర్గే కుమారుడు రాహుల్ ఈ ట్రస్ట్‌కు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఖర్గే కుటుంబానికి చెందిన ట్రస్టు కర్నాటక పారిశ్రామిక ప్రాంత అభివృద్ధి బోర్డు స్థల కేటాయింపు అధికార దుర్వినియోగమని, కర్నాటక సర్కార్ బంధుప్రీతికి సంకేతమని బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాల్వీయ ట్వీట్ చేశారు.

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/
బుధవారం 28 ఆగస్టు 2024



చూసి ముర్వాలే

## 'విశ్వంభర' పై చిరు లీక్స్.. ఆ పాట గురించి చెప్పేశారుగా..! పూనకాలే ఇక?



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, ఆగస్టు 27:మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర'. వశిష్ఠ దర్శకత్వంలో ఈ మూవీ తెరకెక్కుతోంది. సోషియో ఫాంటసీగారూపుదిద్దుకుంటున్న ఈ మూవీలో త్రిష, ఆషికా రంగనాథ్‌లు హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. యువీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం 2025 జనవరి 10న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా.. తాజాగా చిరు ఈ మూవీకి సంబంధించిన ఓ ఆసక్తికర విషయాన్ని బయటకు చెప్పేశారు.ఆగస్టు 22న చిరంజీవి పుట్టిన రోజు అన్న సంగతి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఆయన పుట్టిన రోజును పురస్కరించుకుని ఆ రోజున ఇంద్ర మూవీని రిరిలీజ్ చేశారు. థియేటర్లలో ఈ సినిమాను చూసిన అభిమానులు పూనకాలతో ఊగిపోయారు. రి రిలీజ్‌లోనూ ఈ సినిమా మంచి కలెక్షన్లను సాధించింది. దీంతో ఇంద్ర చిత్ర బృందాన్ని చిరు తన ఇంటికి పిలిపించుకుని మరీ సన్మానించారు.నిర్మాత అశ్వినీదత్, దర్శకుడు బి.గోపాల్, రచయితలు పరుచూరి బ్రదర్స్, చిన్నికృష్ణ, సంగీత దర్శకుడు మణిశర్మలను సన్మానించిన అనంతరం వారితో చిరు ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఇంద్ర సినిమా సంగతులను గుర్తు చేసుకున్నారు.




## యంగ్ టైగర్ ఫ్యాన్స్‌కు పండగే.. 'దేవర' నుంచి ఎన్టీఆర్ స్పెషల్ పోస్టర్

## ది ఫేసెస్ ఆఫ్ ఫియర్

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, ఆగస్టు 27: యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మూవీ దేవర. బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తోంది. సైఫ్ అలీఖాన్ విలన్ గా నటిస్తున్న ఈ మూవీ రెండు భాగాలుగా తెరకెక్కుతోంది. తొలి భాగం సెప్టెంబర్ 27న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. 'ఆర్ఆర్ఆర్' తరువాత ఎన్టీఆర్ నటిస్తున్న మూవీ కావడంతో ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలే ఉన్నాయి.ఇక ఈ సినిమా విడుదలకు సరిగ్గా నెలరోజుల సమయం మాత్రమే ఉండడంతో చిత్ర బృందం సడెన్ సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఎన్టీఆర్ స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. 'ది ఫేసెస్ ఆఫ్ ఫియర్' అని దానికి క్యాప్షన్ ఇచ్చింది. ఈ పోస్టర్ వైరల్‌గా మారింది.ఈ పోస్టర్‌లో ఎన్టీఆర్ రెండు డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తున్నాడు. దీంతో ఈ సినిమాలో ఎన్టీఆర్ ద్వి పాత్రాభినయంలో కనిపించనున్నాడా అనే కామెంట్లు చేస్తున్నారు. చూడాలి మరీ సినిమా విడుదల అయిన తరువాతనే దీనిపై స్పష్టత రానుంది.ఈ మూవీలో బాలీవుడ్ స్టార్ బాబీ డియోల్, ప్రకాశ్ రాజ్, శృతి మరాఠే, శ్రీకాంత్, షైన్ టామ్ చాకో, నరైన్, కలైయారాసన్, మురళీ శర్మ కీలక పాత్రలను పోషించారు. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ బాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన మూవీ ట్రైలర్ కు విశేష స్పందన వచ్చింది. రెండు లిరికల్ సాంగ్స్ సైతం రికార్డు వ్యూస్ సాధించాయి.



## చిరునవ్వులతో మెస్మరైజ్ చేస్తున్న..

## శ్రీదేవి విజయ్ కుమార్



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, ఆగస్టు 27:నారా రోహిత్ కొత్త సినిమా సుందరకాండలో శ్రీదేవి విజయ్ కుమార్ నటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె ఫొటో షూట్లో పాల్గొన్నారు.

## ప్రాపర్టీ షోలో అను ఇమ్మాన్యుయేల్.. ఎల్లో శారీలో ఎల్లోరా శిల్పంలా ఉన్న మజ్ను బ్యూటీ!


ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, ఆగస్టు 27:ఎల్లో శారీ కట్టి ఎల్లోరా శిల్పంలా ఉన్న అను ఇమ్మాన్యుయేల్ చూపు తిప్పుకోనివ్వకుండా ఉంది. ఆ ఫొటోస్ పై మీరూ ఓ లక్కేయండి...



## పల్చటి చీరలో పరువాల విందు.. పోరగాళ్లలో సెగలు పుట్టిస్తున్న 'జబర్దస్త్' బ్యూటీ

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, ఆగస్టు 27:'జబర్దస్త్' బ్యూటీ వర్ష మరోసారి గ్లామర్ షోతో ఆకట్టుకుంది. పింక్ కలర్ శారీలో గులాబీలా మెరిసిపోతూ అలరించింది. అమ్మడు అందాలు చూసి కుర్రాళ్లు ఫిదా అవుతున్నారు.

## విజయవాడలో ఓజీ.. ముంబై తలపించే సెట్?



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, ఆగస్టు 27:ప్రస్తుతం పవన్‌కల్యాణ్ చేతిలో ఉన్న సినిమాలు హరిహరవీరమల్లు, ఓజీ, ఉస్తాద్ భగత్‌సింగ్. ఈ మూడు చిత్రాలనూ పూర్తి చేస్తానని సదరు చిత్రాల నిర్మాతలకు పవన్ భరోసా ఇచ్చేశారు. అందులో భాగంగా ముందు ఆయన 'ఓజీ' సినిమాను పూర్తి చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే దాదాపుగా 80శాతం ఈ సినిమా పూర్తయింది. ముంబై నేపథ్యంలో గ్యాంగ్‌స్టర్స్ కథాంశంగా తెరకెక్కుతున్న 'ఓజీ' సినిమా షూటింగ్‌ని దర్శకుడు సుజిత్ సెప్టెంబర్‌లో ప్లాన్ చేశారు.కథ రిత్యా ఇది ముంబై నేపథ్యమే అయినా.. ఇందులో కథానాయకుడి పాత్రకు విజయవాడతో సంబంధం ఉంటుందట. అందుకే విజయవాడకు సంబంధించిన సన్నివేశాలతో పాటు ముంబై సీన్స్‌ని కూడా దర్శకుడు సుజిత్ విజయవాడలోనే ప్లాన్ చేశారట. పవన్‌కి ఇబ్బంది లేకుండా అక్కడే ముంబైని తలపించే ఓ సెట్‌ని నిర్మించే పనిలో ఉన్నారట చిత్ర యూనిట్. విజయవాడకు సంబంధించిన సన్నివేశాలను అవుట్‌డోర్‌లో చిత్రీకరించి, ముంబై సీన్స్‌ని సెట్‌లో పూర్తి చేస్తారట. ఈ సినిమాకోసం వారానికి రెండు రోజులు మాత్రమే పవన్ డేట్స్ కేటాయించినట్లు తెలుస్తున్నది. పవన్ పార్ట్ పూర్తి చేసిన తర్వాత పోస్ట్ ప్రొడక్షన్‌పై దృష్టిసారిస్తారట సుజిత్. ఈ ఏడాది చివరల్లో 'ఓజీ'ని విడుదల చేయడానికి నిర్మాత డీవీవీ దానయ్య ప్లాన్‌చేస్తున్నారు. ఇందులో ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే.

## అరియానా ఏందీ ఈ అందాల ప్రదర్శన.. లేటెస్ట్ ఫోటోషూట్‌తో బ్యూటీ



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, ఆగస్టు 27: బిగ్‌బాస్ ఫేమ్ అరియానా గ్లోరి తన లేటెస్ట్ ఫోటోషూట్‌తో మరోసారి అభిమానులను షాక్‌కి గురి చేసింది. హాట్ లుక్స్‌తో క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ తో ఎ.ిో టో ల ం దిగింది.

PUBLISHED AND PRINTED BUY K.RAKESH. ON BEHALF OF RRR MEDIA ..Editor : **RR RATHNA**, Address.Patel Nagar Chowrastha, Amberpet, Hyderabad,Telangana - 500013.
**RNI NO. T/TG/2024/ 1093** ..Mobile No : 7013794396, 9949152838 ,Website : www.eyyaltynews.comEMAIL ..ramannews9@gmail.com.